# నిరాశ

శ్రీమతి ముదునూరి జానకి

"ఏమండీ, మిమ్మల్నే. మనకమలకి పెండ్లి సంబంధము ఏదైనా చూడాలన్న మాటే లేదేమండి. పిల్లకి ఇరవై ఏండ్లు వచ్చాయి. ఇంకా ఎంతకాలం మనింట్లో పెట్టుకోవడం. ఏమిటో చదువు, చదువుట. చదివి వుద్యోగం చేస్తుందా ఏమన్నానా. దానియిష్టం అంటారు. వూళ్లో అమ్మలక్కలంతా అడిగే వారే" అంటూ సీతమ్మ భర్తతో యధాప్రకారంగా పురాణం మొదలెట్టింది.

'అబ్బ, ఏమిటే ఆగోల. కాస్సేపు పేపరయినా చదవనివ్వవు. దాని యిష్టం వచ్చినప్పుడే చేసుకుంటుంది" అంటూ పేపరు చదువుతూ సోఫాలో కూర్చున్నాడు రమణయ్యగారు. ఇంతలో, కమల కాలేజీకి వెళ్లే సన్నాహంలోవుంది. "కమలా, కమలా," అంటూ రమణయ్యగారు తన కుమార్తెను పిలిచారు. "ఏం నాన్నా," అంటూ వచ్చి ఎదురుగానున్న సోఫాలో కూర్చుంది కమల. "ఏం లేదమ్మా నీకు పెండ్లియీడు వచ్చిందికదా అని, ఏదైనా నీకిష్టమొచ్చిన సంబంధము చూసి యీ యేడాదిలోగా పెండ్లిచేయాలనుకుంటున్నానమ్మా" అన్నాడు రమణయ్యగారు.

"ఇప్పుడు చేసుకోనునాన్న. బి.ఏ. పూర్తి చేస్తేకాని పెండ్లి చేసుకోను, నాయిష్టం వచ్చినప్పుడే చేసుకుంటాను" అన్నది.

"అలా కాదమ్మా, ఏదో పెద్దవాణ్ణి. అడుగుతున్నాను, చెప్పమ్మా నీకునచ్చిన వరునకే" యిచ్చి చేస్తాను.

"సరే అంతగా అడుగుతున్నారు కాబట్టి చెప్తున్నాను. నేను మోహన్ రావునితప్ప యింకొకడిని చేసుకోనునాన్న." అంటూ లేచి మేడమెట్లు ఎక్కబోతుంది. ఇంతట్లో రమణయ్యగారికి అరికాలిమంట నెత్తికెక్కింది. "ఆవెధవా నీకునచ్చింది! ఏమైనా సరే, మోహన్ రావుని చేసుకునేందుకు వీలులేదు. బాగా ఆలోచించుకో కమలా" అంటూ రమణయ్యగారు బయటికి వెళ్లిపోయారు.

ఇంతకీ మోహన్ రావు కమలకి మేనత్త కొడుకే. ఏవోకొన్ని కారణాలవల్ల రమణయ్యగారికి, మోహన్ రావుకి మనస్పర్ధలు ఏర్పడ్డాయి. కమలా, మోహనులు, కాలేజీలో ఒకేక్లాసు చదువుచున్నారు. కమలకి మోహన్ అంటే చాలా యిష్టం.

ఇలా రోజులు గడిచాయి. కమల, నిద్ర ఆహారం లేక ఒకటే పట్టుతో గదిలో సత్యభామలా, అలకవహిస్తోంది. రమణయ్యకేమీ తోచక, భార్యను పిలిచి అడిగాడు. ఆమె వెంటనే మోహన్ రావు యింటికివెళ్లి, సంబంధము ఒప్పుకోని రమ్మనమని చెప్పింది. రమణయ్యగారు చేసేది ఏమీ లేక మోహన్ రావు ఇంటికి వెళ్లాడు.

"రారా, మామయ్యా" అంటూ మోహన్ రావు, ఆహ్వానించాడు. ఏన్నాళ్లనుంచో రాని రమణయ్యగారిని చూసి, మోహన్ రావుతల్లి విశేషాలేమిటిరా రమణయ్యా అంటూ అడిగింది.

"ఏమని చెప్పను. మా కమల మోహనుని తప్ప ఇంకెవరిని పెండ్లి చేసుకోదట. ఏంరా మోహన్, నీవుద్దేశ్యంఏమిటి? నీకోసం బెంగపెట్టుకొని తిండి తిప్ప లేకుండా, ఒకటే మొండిపట్టు పట్టుకు కూర్చుంది. నీకు పుణ్యం వుంటుంది. ఒప్పుకో వెంటనే ముహూర్తం నిశ్చయించి మీ యిద్దరికి పెండ్లి చేస్తాను," అంటూ బ్రతిమాలాడు రమణయ్యగారు.

అంతా విన్నాడు మోహన్‌రావు. "మామయ్యా, నేను చాలా అదృష్టవంతుడిని" అన్నాడు. "ఏం నాయినా ఐతే ఎప్పుడు ముహూర్తం అని, ఆదుర్దాగా అడిగాడు రమణయ్యగారు. "అది కాదు మామయ్యా, నీవు ముందరే తెలియపర్చినందుకు చాలా సంతోషం. అటువంటి మొండి మనిషితో నేను వేగలేను. జీవితంలో ఏవిధమైనసుఖము వుండదు. అన్నిటికీ, మొండిపట్టుపట్టే మనిషితో కాపురం సాగదు. నీవుముందరే చెప్పినందుకు నా వందనాలు. ఇదిగో కొంచెము కాఫీపుచ్చుకో మామయ్యా" అంటూ మోహన్‌రావు మామయ్య రమణయ్యగారితో తన వుద్దేశ్యం వెల్లడించాడు.

రమణయ్యగారు నిరాశతో, చెప్పడానికి ఏమీ తోచక నెత్తిని గుద్దేసుకొని యింటి దారి పట్టాడు. కమల యీ విధంగా వుందని చెప్పితే, సంతోషంతో, ఒప్పుకుంటాడు గదా, అని రమణయ్యగారు ఆతురతతో చెప్పాడు. ఇదివిన్న మోహన్‌రావుకి, కమల మొండితనం నచ్చలేదు. అటువంటి మొండిదానిని చేసుకోవడంలో సుఖం లేదనుకున్నాడు. ఇంతకీ రమణయ్య నిరాశతో యింటికి పోయాడు. కథ అడ్డం తిరిగినందుకు విచారించాడు.



సేవించుడు

శ్రీపాదకృష్ణమూర్తిశాస్త్రి అండ్ సన్స్
రాజమండ్రి

స్త్రీలరోగనివారిణి

| | |
|---|---|
| ఋతుశూల | హిస్టీరియా |
| మైల సరిగా కాకుండుట | శరీరము లావుబారుట |
| మైల అధికముగ వెడలుట | ఆయాసము |
| సంతానము లేకుండుట | తిమ్మిర్లు |
| శ్వేతప్రదరము | అజీర్ణము |
| రక్తప్రదరము | ఆకలి సరిగా లేకపోవుట |

మొదలగువానికి వరప్రసాదిని

తులం 1 కి రు. 4-0-0

★

Or 10 గణపతి మొదలివీధి,
రాయపేట, మద్రాసు-14